హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.180	250	270
నల్లగొండ	రూ.172	240	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 24.4



డీసీసీబీ పీఠంపై
కాంగ్రెస్ కన్ను

అసెంబ్లీ ఎన్నికల్లో అప్రతిహత విజయాలు, పార్లమెంటు ఎన్నికల్లో రికార్డు మెజార్టీలతో గెలుపు, ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయంతో ఉమ్మడి జిల్లాలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా డీసీసీబీ పీఠంపై కన్నేసింది. రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసిన సందర్భంలో, ఆ ప్రక్రియ ప్రారంభమయ్యేలోగా డీసీసీబీ చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు వ్యూహం రచించింది. ఇప్పటికే డీసీసీబీ వైస్ చైర్మన్ సహా మెజార్టీ డైరెక్టర్లు కాంగ్రెస్ వైపునకు రావడంతోపాటు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. అవిశ్వాసానికి సిద్ధమైన డైరెక్టర్లు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సంప్రదించగా, వారు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అవిశ్వాస ప్రక్రియను ప్రారంభించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనుచరుడు, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మొత్తం 14 మంది డైరెక్టర్లు వారి సంతకాలతో కూడిన నోటీసును జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్‌కు సోమవారం అందజేశారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం
- కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నోటీసులు ఇచ్చిన 14మంది డైరెక్టర్లు
- ఆలోగా చైర్మన్ పదవికి రాజీనామా యోచనలో గొంగిడి?
- కొత్త చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డికి చాన్స్

'కుంభం'కే పదవి దక్కే అవకాశం..



క్యాంపునకు వెళ్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా పేరున్న మునుగోడు నియోజకవర్గానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికే డీసీసీబీ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉంది. ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు డైరెక్టర్లను సమీకరించడంతో పాటు, మంత్రులు, ఎమ్మెల్యేలను ఒప్పించే ప్రక్రియలో ఆయనే క్రియాశీలకంగా వ్యవహరించారు. అవిశ్వాస నోటీసు ఇచ్చిన డైరెక్టర్లంతా కుంభం శ్రీనివాస్‌రెడ్డికే మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిసింది. డైరెక్టర్లు నోటీసు ఇచ్చేందుకు శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బస్సులో నల్లగొండకు తరలివచ్చారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పదవీ కాంక్షతో తాము అవిశ్వాసతీర్మానం పెట్టలేదని, నాలుగేళ్లుగా డీసీసీబీలో మహేందర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని, ఉద్యోగుల బదిలీలు, ఇతర కార్యకలాపాల్లో ఇష్టారీతిగా వ్యవహరించారని, డైరెక్టర్లను పరిగణనలోకి తీసుకోలేదని వారు పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ వల్లే తనకు పదవి వచ్చిందని మాట్లాడేవారని, కానీ రైతుల దయాదాక్షిణ్యంతో పదవులు వచ్చిన విషయాన్ని విస్మరించారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకే తాము చైర్మన్ మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. నోటీసు ఇచ్చిన అనంతరం డైరెక్టర్లంతా ప్రత్యేక బస్సులో క్యాంపునకు తరలివెళ్లారు.

అవిశ్వాసపు నోటీసుపై 28న ప్రత్యేక సమావేశం

ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ మద్దతుతో డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఈనెల 28న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ వెల్లడించారు. తెలంగాణ సహకార చట్టం-1964, సెక్షన్ 34/ఏ ప్రకారం డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాస నోటీసు ఇచ్చారు. సహకార చట్ట నిబంధనల ప్రకారం నోటీసు ఇచ్చిన 15 పని దినాలలోగా ప్రత్యేక సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానంపై చర్చించి, అవసరమైతే ఓటింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నిబంధనల ప్రకారం ఈనెల 28వ తేదీ ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సహకార శాఖాధికారి నిర్ణయించారు. అవిశ్వాస తీర్మాన నోటీసుపై పాలకవర్గ డైరెక్టర్లు కుంభం శ్రీనివాస్‌రెడ్డి, గుడిపాటి సైదులు, ధనావత్ జయరాం, కోడి సుష్మ, పాశం సంపత్‌రెడ్డి, అందెల లింగం యాదవ్, విరిగినేని అంజయ్య, బంటు శ్రీనివాస్, కొండ సైదయ్య, ఎస్.అనూరాధ, జూలూరి శ్రీనివాస్, కె.వీరస్వామి, కొమ్ము కరుణ, ఎం.రామచంద్రయ్య సంతకాలు చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి సైతం అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారని,ఆయన విదేశీ పర్యటనలో ఉన్నందున నోటీసుపై సంతకం చేయలేకపోయారని కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న డైరెక్టర్లు తెలిపారు.అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చిన 14మంది డైరెక్టర్లలో కుంభం శ్రీనివాస్‌రెడ్డి మినహా మిగిలిన వారంతా అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బీఆర్‌ఎస్‌లో కొనసాగినవారే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఆ తరువాత వారంతా క్రమక్రమంగా కాంగ్రెస్‌లో చేరారు. ప్రధానంగా గొంగిడి మహేందర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ప్రధాన ఆరోపణతో వారంతా అవిశ్వాసానికి మొగ్గుచూపారు.

గొంగిడి రాజీనామా చేసే చాన్స్?

డీసీసీబీ పాలకవర్గంలో అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన సంఖ్యాబలం కాంగ్రెస్‌కు ఉండడంతో తీర్మానంపై సమావేశానికి ముందే చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి రాజీనామా చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. మొత్తం 19మంది డైరెక్టర్లలో 15 మంది ఆయనకు వ్యతిరేకంగా ఉండడంతో తీర్మానం నెగ్గడం ఖాయంగా కనిపిస్తోంది. మొత్తం పాలకవర్గంలో మూడింట రెండొంతుల మెజార్టీ ఉంటే అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఇప్పటికే కాంగ్రెస్‌కు ఈ సంఖ్యాబలం ఉండటంతో పదవీచ్యుతుడవడానికి ముందే ఒకటి, రెండు రోజుల్లో ఆయన రాజీనామా చేస్తారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. రాజీనామా సందర్భంగా అవిశ్వాసానికి దారితీసిన పరిస్థితిపై మహేందర్‌రెడ్డి ప్రకటన చేసే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవలి వరకు టెస్కాబ్ వైస్ చైర్మన్‌గానూ కొనసాగిన మహేందర్‌రెడ్డి అక్కడ కూడా అవిశ్వాస తీర్మానపు నోటీసు ఇవ్వడంతో టెస్కాబ్ చైర్మన్‌తో కలిసి ఆ పదవికి రాజీనామా చేశారు. తాజాగా అదే బాటలో డీసీసీబీ చైర్మన్ పదవికి కూడా ప్రత్యేక సమావేశానికి ముందే ఆయన రాజీనామా చేస్తారని తెలుస్తోంది.



సహకార శాఖాధికారికి నోటీసు అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

కోడ్ ముగిసె..
ఆశలు చిగురించే

245 రోజుల్లో 144 రోజులూ ఎన్నికల కోడ్

అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పట్టాలెక్కేనా?

అసెంబ్లీ ఎన్నికలు, ఆ తరువాత పార్లమెంట్ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ రాగా, ప్రభుత్వ పాలనకు అడ్డుగా మారి అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిలిచాయి. ఆదివారంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ 58 రోజులు కొనసాగగా, పార్లమెంట్ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ మరో 86 రోజుల పాటు కొనసాగింది. మొత్తంగా 245 రోజుల్లో 144 రోజులు ఎన్నికల కోడ్ నడిచింది. దీంతో ఎక్కడికక్కడ అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిలిచాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియగా ప్రభుత్వం పాలనపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో అభివృద్ధి,సంక్షేమ పథకాలు పట్టాలెక్కుతాయని ప్రజలు భావిస్తున్నారు. అయితే ఇప్పటికే పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో పాటు మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు కూడా త్వరలో ముగియనుంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ ఎన్నికల నిర్వహణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలు, బీసీ గణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే అప్పటి వరకు ఎన్నికల కోడ్ లేనందున ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులతోపాటు, కొత్తగా అభివృద్ధి పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

- భువనగిరి టౌన్

•7లో..



ప్రభుత్వ పాఠశాలల్లోనే
నాణ్యమైన విద్య



- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం
- పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

8

వెలవెలబోతున్న
పులిచింతల ప్రాజెక్టు



- కనిష్ట స్థాయి దిగువలో నీటి నిల్వలు
- ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి 45.77 టీఎంసీలు
- ప్రస్తుత నిల్వ 0.7 టీఎంసీలే

7

ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య కేసులో
నలుగురు అరెస్టు



- భార్య, ఆమె తల్లి, సోదరుడు, ప్రియుడికి రిమాండ్
- సారీ తమ్ముడూ చనిపోతున్నా అంటూ ఫొటోగ్రాఫర్ రంజిత్ సెల్ఫీవీడియో
- నెల రోజుల కిందటే వీడియో తీసిపెట్టుకున్న రంజిత్

7


దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 10 : 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజలు అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ మూడో విడత కాలనీలో, కేసారం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లను అప్పగించేందుకు 10 బృందాలను ఏర్పాటు చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూర్యాపేట ఆర్డీవోకు సూచించారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నందున పనులు పూర్తయిన పాఠశాలలను ఎమ్మెల్యేలతో ప్రారంభించి, విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సతీష్‌కుమార్, జడ్పీ సీఈవో అప్పారావు, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, ఆర్డీవో వేణుమాధవ్, డీఈవో అశోక్, డీపీవో సురేష్, డీఏవో శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా డీటీడబ్ల్యూవో వెంకటరమణ, ఏవో సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు చెప్పొద్దు



నూతన చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట క్రైం, జూన్ 10 : అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు చెప్పవద్దని ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను తీసుకుని, మాట్లాడారు. కొంతమంది తెలియని వ్యక్తులు ఆన్‌లైన్‌లో మీకు బహుమతులు వచ్చాయని, బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ నెంబరు, ఆధార్ కార్డు వివరాలు అడిగి మోసగిస్తారని వివరించారు. బ్యాంకు అధికారులు ఎవరు కూడా, ఎప్పుడు కూడా ఫోన్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అడగరని, దానిని గమనించాలన్నారు. ఎక్కడైనా అపరిచిత వ్యక్తులు సంచరించినా వెంటనే డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నూతనచట్టాలపై ప్రతీ పౌరుడు, పోలీస్ అధికారి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి నూతన చట్టాలపై పోలీస్ సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే బాధితులకు న్యాయం సాధ్యమవుతుందన్నారు. చట్టాలను అమలు చేయాలంటే ప్రతీ అంశంపై ఖచ్చితంగా అవగాహన ఉండాలన్నారు. అప్పుడే విధి నిర్వహణలో ప్రతిభ చూపే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ హైకోర్టు న్యాయవాది, సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ తెలంగాణ పోలీస్ అకాడమీ అధ్యాపకుడు డాక్టర్ సాంబమూర్తి నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఉత్తమ్

- చివరి ఆయకట్టు వరకూ నీరందిస్తాం
- చెరువు ఆక్రమణదారులపై కేసులు
- మరమ్మతులకు లక్షలు ఖర్చవుతాయని వెనకాడొద్దు
- సకాలంలో ఎత్తిపోతలను అందుబాటులోకి తేవాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్ వెంకటరావు

కోదాడ, జూన్ 10 : రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కోదాడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ఎత్తిపోతల పథకాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న తరుణంలో ఈలోపే ఎత్తిపోతల పథకాల పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కోదాడ, హుజూర్‌నగర్ పరిధిలో ఇంజనీర్ల కొరత ఉందని హుజూర్‌నగర్ పరిధిలో 18 మంది ఏఈలు అవసరం ఉండగా 11 మంది ఉన్నారని, కోదాడ పరిధిలో 16 మందికి 13 మంది ఏఈలు ఉన్నట్లు మంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అందుకు మంత్రి స్పందిస్తూ సిబ్బంది తక్కువగా ఉంటే తీసుకుని పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా యుద్ధప్రాతిపదికన పనిచేసి ఎత్తిపోతల పథకాలను సకాలంలో అందుబాటులోకి తేవాలని మంత్రి అన్నారు. వందల కోట్లు చేసి ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు చిన్నచిన్న మరమ్మతులకు రూ.లక్షలు ఖర్చవుతుందని వెనకాడవద్దన్నారు. అలా చేయడం వల్ల వేల ఎకరాల ఆయకట్టు సాగుకు నోచుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో మరమ్మతులకు ఎన్ని నిధులు కావాలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా ఇరిగేషన్ అధికారులు కలెక్టర్ వెంకటరావుతో పాటు ఇతర శాఖల అధికారులను, రైతులను సమన్వయం చేసుకుంటూ సాంకేతిక సమస్యలుంటే అధికమించి పనులను వేగవంతం చేయాలన్నారు. చెరువులు రికార్డుల్లో ఎంత ఉంటే అంతే ఉండాలి తప్ప మట్టి పేరుతో ఆక్రమణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఆక్రమణలపై మిన్నకుంటే భవిష్యత్ తరాలకు ఏమీ ఉండదన్నారు. ఆక్రమణలను సీరియస్‌గా తీసుకుని ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూడికను రైతులు సొంత ప్రయోజనాలకు వాడుకోవచ్చునని తెలిపారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్య ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. సమస్య పేరుతో కాలయాపన చేస్తూ పొలాలకు నీరందకుండా చేయడం సరికాదన్నారు. సమీక్షా సమావేశంలో కలెక్టర్ వెంకటరావు, ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ నాగేందర్‌రావు, ఎస్ఈ నరసింహారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కాంగ్రెస్ నాయకులు సామల శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు, నాయకులు

విద్యారంగ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



విద్యార్థుల నమోదుకు ప్రచారం నిర్వహిస్తున్న తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంగ

కోదాడ టౌన్, జూన్ 10 : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేపీ మంగ పిలుపునిచ్చారు. సోమవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కరపత్రాలు పంపిణీ చేసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, ప్రభుత్వ బాధ్యత అని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అన్నివర్గాల ప్రజలు కృషి చేయాలన్నారు. సమాజంలో ప్రభుత్వ పాఠశాలలు నిలదొక్కుకున్నప్పుడే చదువుల్లో అంతరాలు పోతాయన్నారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ విద్యారంగంపై తల్లిదండ్రులకు పూర్తి భరోసా కల్పించాలన్నారు. తెలంగాణ పౌరస్పందన వేదిక ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై ఉన్నాయని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ప్రభుత్వ విద్యారంగంతోనే రాజ్యాంగపరమైన హక్కులు సమాజానికి అందుతాయన్నారు. తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడులు నిలబడేందుకు సమరశీల ఉద్యమం చేస్తున్నామన్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్ ధనమూర్తి, ప్రాంతీయ అధ్యక్షుడు వీ వెంకటరమణ, కాప్రా ఉపాధ్యక్షుడు జీ వెంకటరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రంగారెడ్డి, జీ వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ ఖాజామియా, డీఎస్ స్వామి, శేఖర్, హమీద్ పాల్గొన్నారు

వైద్య, ఆరోగ్య శాఖ
అనుమతులు పొందాలి

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 10 : జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఆయుర్వేద క్లినిక్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు విధిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నుంచి అనుమతులు పొందాలని డీఎంహెచ్‌వో కోటా చలం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించి ఆ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు ఇవ్వకుండానే రూ.50వేల జరిమానా విధిస్తామన్నారు. ఈ నెల 14వ తేదీలోపు డీఎంహెచ్‌వో కార్యాలయంలో అనుమతులకు సంబంధించిన పత్రాలు అందజేయాలన్నారు.

చందుపట్ల ఫీల్డ్ అసిస్టెంట్‌పై
చర్యలు తీసుకోవాలి

7

- కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన గ్రామస్థులు

హరిహరులకు విశేష పూజలు

నిత్య ఆదాయం రూ.31.77లక్షలు

భువనగిరి అర్బన్, జూన్ 10: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధ ఆలయం పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి, శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేద మంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. 15వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.31,77,476 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



లక్ష్మీ నృసింహుడికి నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ముగిసిన క్రీడా శిక్షణ

మిర్యాలగూడ టౌన్, జూన్ 10: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన వేసవి శిక్షణ ముగిసింది. నిర్వాహకులు హర్ష ఏచూరి మాట్లాడుతూ విద్యార్థులు సెలవులలో క్రీడా సాధన చేయాలని సూచించారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్నిస్తాయన్నారు. 45రోజులు పాటు ఇచ్చిన శిక్షణలో పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు పలు విభాగాలలో తర్ఫీదు పొందడం హర్షనీమన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ పాల్గొన్నారు.

కోడ్ ముగిసె.. ఆశలు చిగురించే

● 245 రోజుల్లో 144 రోజులూ ఎన్నికల కోడ్లు ● అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పట్టాలెక్కేనా..? ● మరో మూడు ఎన్నికల కోడ్లు వచ్చే అవకాశం



ఎన్నికల కోడ్ ముగియడంతో నల్లగొండలో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ప్రజలు

భువనగిరి టౌన్, జూన్ 10: పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసింది. ఎన్నికల షెడ్యూల్స్ వెలువడినప్పటి నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ 86రోజుల అనంతరం ఆదివారంతో ఉమ్మడి జిల్లాలో ముగిసింది. దీంతో ప్రభుత్వ అభివృద్ధి పనులకు అడ్డంకి తొలగింది. ప్రభుత్వ పథకాల అర్హులైన లబ్ధిదారుల్లో ఆశలు పెరిగాయి. అసెంబ్లీ, పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వరుసగా మూడు ఎన్నికల కోడ్‌లు రాగా త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల పేరిట మరో మూడు ఎన్నికల కోడ్‌లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రతిపాదిత అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను త్వరలోనే పట్టాలు ఎక్కించాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉన్నది.

వరుసగా ఎన్నికల కోడ్లు

245 రోజుల్లో మూడు దఫాలుగా 144 రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 2023 అక్టోబరు 9వ తేదీ నుంచి కౌంటింగ్ పూర్తయిన రెండు రోజులు వరకు అనగా 2023 డిసెంబరు 5వ తేదీ వరకు 58రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. తిరిగి లోక్‌సభ ఎన్నికల కోడ్ 16 మార్చి 2024న వెలువడిన పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌తో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ 2024 జూన్ 6వ తేదీతో దేశమంతటా ముగిసినా 25ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మాత్రం ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాలో ఈ నెల 9తో ముగిసింది. దీంతో రాష్ట్రంలోని మిగితా ఏడు ఉమ్మడి జిల్లాలతో పోలిస్తే ఆ మూడు ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు రోజులు ఎన్నికల కోడ్ అదనంగా అమలులో ఉండడంతో వరుసగా 86 రోజల పాటు ఎన్నికల కోడ్ అమలైంది. అలాగే సర్పంచుల పదవీ కాలం 2024 జనవరితో ముగిసినా ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించలేదు. ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం కూడా జూలైతో ముగియనుంది. ప్రస్తుత మునిసిపల్ కౌన్సిళ్ల గడువు 2025 జనవరితో ముగియనుంది. దీంతో రానున్న ఏడు నెలల వ్యవధిలో మరో మూడు సార్లు ఎన్నికల కోడ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముగిసిన పార్లమెంట్ ఎన్నికల కోడ్, త్వరలో రానున్న మూడు స్థానిక సంస్థల ఎన్నికల మధ్య ఉన్న స్వల్ప వ్యవధిలోనే ప్రతిపాదిత అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రభుత్వం, అధికారులు అమలు చేయాల్సి ఉంది.

ఏఎంసీ పాలకవర్గాల నియామకాలకు గ్రీన్ సిగ్నల్

చౌటుప్పల్ టౌన్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్రంలో ఏఎంసీ పాలకవర్గాలను నియమించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం నియామకంపై కాంగ్రెస్‌లోని ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎస్సీ జనరల్ కేటగిరికి కేటాయించిన ఛైర్మన్ పదవి కోసం ఆరుగురు నాయకులు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమిస్తున్న వారికే ఛైర్మన్ పదవి కేటాయించి న్యాయం చేయాలని, తరుచూ పార్టీలు మారే నాయకులను దూరం పెట్టాలని కార్యకర్తల నుంచి డిమాండ్ పెరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మంచిర్యాల జిల్లాలో మూడు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాలను ఈ నెల 7న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావాహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

రూ.100కోట్లతో చేపట్టనున్న భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనులకు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే కొన్ని రోజుల ముందే ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల షెడ్యూల్‌తో ప్రతిపాదిత పనులు ప్రారంభం కాలేదు. అలాగే పదేళ్లుగా నిలిచిన నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ చివరి విడత పనులను ప్రభుత్వం పూర్తి చేయాలని సంకల్పించినప్పటికీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారిందని ప్రచారం జరిగింది. దీంతో ఎన్నికల కోడ్ ముగిసినందున ఉమ్మడి జిల్లాలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు చేపట్టడానికి మార్గం సుగమమైంది. ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ పలు కారణాలతో పలు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఈ మేరకు అప్పట్లోనే వచ్చిన నిరసనలతో ప్రభుత్వం తిరిగి దరఖాస్తులకు అవకాశం కల్పించినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గృహజ్యోతి తదితర పథకాల లబ్ధి దరఖాస్తుల స్వీకరణ అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలోనే మిగితా శాఖల్లో కూడా బదిలీలు, పదోన్నతులు ప్రారంభం కానున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసినందున ఆరు గ్యారంటీ పథకాలతో ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ ప్రభుత్వం నెరవేరుస్తుందని అర్హులు ఆశాభావంతో ఉన్నారు. అలాగే పనులు నిమిత్తం నాయకుల వద్దకు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తున్న ప్రజలకు నాయకులు, అధికారులు ఎన్నికల కోడ్ సాకు చూపుతూ పనులు వాయిదా వేస్తూ వచ్చారు. కానీ ఎన్నికల కోడ్ ముగిసినందున సాకులు చెప్పి తప్పించుకునే అవకాశం నాయకులకు, అధికారులకు చేజారి తప్పనిసరిగా పనులను చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	504.70 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	800
శ్రీశైలం నీటిమట్టం	809.00 అడుగులు

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	0.71 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

- మేళ్లచెర్వు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	636.76 అడుగులు
మూసీకి నీటి రాక	534 క్యూసెక్కులు
నీటి విడుదల	నిల్

- కేతేపల్లి

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

మఠంపల్లి, జూన్ 10: కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని మట్టపల్లి-హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై జరిగింది. పెదవీడు గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ద్విచక్ర వాహనంపై మఠంపల్లికి వస్తుండగా మఠంపల్లి నుంచి పెదవీడు వైపునకు వెళ్తున్న టాటా సుమో ఢీకొంది. దీంతో షేక్ మహమ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పైలెట్ శ్రీనివాస్, ఈఎంటీ ప్రవీణ్ సంఘటనా స్థలాన్ని చేరుకొని క్షతగాత్రుడిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

ఆవుల డీసీఎం పట్టివేత

చౌటుప్పల్ రూరల్ జూన్ 10: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద ఆవుల డీసీఎంను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా నుంచి 72ఆవుల లోడుతో డీసీఎం హైదరాబాద్‌కు వెళ్తుంది. సమాచారం అందుకున్న పోలీసులు డీసీఎంను పట్టుకున్నారు. ఆవులను హైదరాబాద్ గోశాలకు పంపించారు. డ్రైవర్ నూనవత్ కృష్ణాను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంట్లో చోరీ.. రూ.90వేల నగదు అపహరణ

మాడ్గులపల్లి, జూన్ 10: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి రూ.90వేల నగదు అపహరించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలకేంద్రంలో ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన ఆరూరి నరేష్ ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలిసి తన బంధువుల ఇంటికి వెళ్లారు. అదేరోజు సాయంత్రం నరేష్ కూతురు ఇంటికి వచ్చి చూడగా గేట్ తాళంతోపాటు ఇంటితాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే తన తండ్రి నరేష్‌కు సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న నరేష్ ఇంట్లోకి వెళ్లి గమనించగా బీరువాలోని రూ.90వేల నగదు చోరికి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య కేసులో నలుగురు అరెస్టు

● వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకు దాడి ● భార్య వ్యవహారంతో విసుగు చెంది బలవన్మరణం



కేసు వివరాలు వెల్లడిస్తున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, జూన్ 10: 'సారీ తమ్ముడు చచ్చిపోతున్నా' నంటూ సెల్ఫీ వీడియో తీసిన ఫొటోగ్రాఫర్ రంజిత్ ఆత్మహత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్యలు కేసు వివరాలను వెల్లడించారు. హుజూర్‌నగర్‌లోని పద్మశాలీ కాలనీకి చెందిన చిట్టిప్రోలు రంజిత్‌కుమార్(35) 14 సంవత్సరాల క్రితం మండల పరిధిలోని శ్రీనివాస్‌పురం గ్రామానికి చెందిన స్వప్నను ప్రేమించి కులాంతర వివాహం చేసుకోగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత ఏడాది రంజిత్ భార్య స్వప్నకు సీతారాంనగర్ కాలనీలో రేషన్ డీలర్ షాపు రావడంతో ఆ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని రేషన్ దుకాణం నిర్వహిస్తోంది. రంజిత్‌కుమార్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలల క్రితం పట్టణానికే చెందిన మిట్టకోలు దుర్గాప్రసాద్‌తో స్వప్నకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. రంజిత్‌కు తెలియకుండా కొద్దిరోజుల క్రితం దుర్గాప్రసాద్ స్వప్నను తిరుపతికి తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న రంజిత్‌కుమార్ స్వప్నను పలుమార్లు హెచ్చరించినా ఎలాంటి మార్పు రాలేదు. దుర్గాప్రసాద్‌తో మరింత చనువు పెరగటంతో కుటుంబంలో ఘర్షణలు జరుగుతున్నాయి. కాగా వివాహేతర సంబంధంపై రంజిత్ స్వప్నను నిలదీస్తుండగా రెండు, మూడు సార్లు స్వప్న తల్లి రాచకొండ నాగమణి, ఆమె అన్న చంద్రశేఖర్, ప్రియుడు దుర్గాప్రసాద్ అనేకసార్లు రంజిత్‌ను కొట్టారు. దీంతో రంజిత్‌కుమార్ నెల రోజుల క్రితం తన చావుకు భార్య స్వప్న, ఆమె ప్రియుడు దుర్గాప్రసాద్, అత్త నాగమణి, బావమరిది చంద్రశేఖర్ కారణమని ఓ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వారు 'వీడియో ఎందుకు తీసుకున్నావు' అని మరోసారి రంజిత్‌ను కొట్టి ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. దీంతో రంజిత్ మఠంపల్లిలోని తన చెల్లెలు భర్త బావ ఖుర్షీద్ రెస్టారెంట్‌లో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. రంజిత్ తన కుమార్తెలను చూసేందుకు ఈ నెల 7న హుజూర్‌నగర్‌లోని సీతారాంనగర్ కాలనీలో తన భార్య నివసించే ఇంటికి వచ్చాడు. ఆ రోజు భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు స్వప్న హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో రంజిత్‌పై ఫిర్యాదు చేయటంతో కేసు నమోదైంది. ఈ నెల 8వ తేదీన సీతారాంనగర్‌లోని ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గమనించి రంజిత్‌కుమార్ కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కుమారుడు విగతజీవిగా కనిపించాడు. తన కుమారుడు రంజిత్‌ను, భార్య స్వప్న, ఆమె తల్లి నాగమణి, అన్న చంద్రశేఖర్, ఆమె ప్రియుడు మిట్టకోలు దుర్గాప్రసాద్ కలిసి మానసికంగా, శారీరంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకున్నాడని రంజిత్ తల్లి పద్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు స్వప్న, ప్రియుడు దుర్గాప్రసాద్, అత్త నాగమణి, అన్న చంద్రశేఖర్‌లను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. తండ్రి చనిపోవడం, తల్లి జైలుకు వెళ్లడంతో రంజిత్ ఇద్దరు పిల్లలు ఒంటరి వారయ్యారు. మన కుటుంబాల్లో ఇలాంటి వాళ్లు ఉండొద్దు. ఎంతకైనా పోరాడు, వదలొద్దు".. అంటూ భార్య వ్యవహారంతో విసుగుచెందిన భర్త సెల్ఫీవీడియో సూర్యాపేట జిల్లాలో సంచలనంగా మారింది.

విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ డ్రైవర్ మృతి



గుర్రంపోడు, జూన్ 10: ట్రాక్టర్ దున్నుతుండగా విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా సోమవారం రాత్రి మండలంలోని కొత్తలాపురం గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చామకూరి సందీప్(22) ఇదే గ్రామానికి చెందిన భాస్కర్ అనే రైతు తోటలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా వేలాడుతున్న విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని దేవరకొండ ఆసుపత్రికి తరలించారు.

బావిలో పడి మేకల కాపరి మృతి

మోతె, జూన్ 10 : మేకలు కాస్తు మంచినీటి కోసం వెళ్లి బావిలో పడి మేకల కాపరి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని సిరికొండలో సోమవారం జరిగింది. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టెబోయిన సోమయ్య లింగయ్య(28) రోజుమాదిరిగానే మేకలను తోలుకుని గ్రామశివారులో మేకలను మేపుతున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సమీపంలో ఉన్న పెద్ద బావిలో మంచినీరు తాగేందుకు దిగడంతో కాలు జారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడం, కొద్దిగా మందమరుపు ఉండడంతో కేకలు వేయలేక బావిలోనే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు మేకల వద్ద ఎవరూ లేకపోవడంతో బావి వద్ద చూడగా అందులో మృతిచెందాడు. స్థానికుల సహాయంతో పోలీసులు బావిలో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు.

గ్యాస్‌లీకై ఇల్లు దగ్ధం

మోతె, జూన్ 10 : గ్యాస్‌లీకై ఇల్లు మంటల్లో పూర్తిగా దగ్ధమైన సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని అన్నారిగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పడిశాల సువార్త ఇంట్లో గ్యాస్ లీకై మంటలు లేచి ఇంట్లో ఉన్న బియ్యం బస్తాలు, వంటసామాగ్రి పూర్తిగా దగ్ధమైనవి సుమారు రూ. 50వేల ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో...

నూతన్‌కల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల దిర్శనపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిదిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన అనంతుల ఆంజనేయులు తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ పరిదిలోని చిననేమిల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద విదులు నిర్వహిస్తున్నాడు. రోజు వారిగానే విదులకు వెళ్లాడు. దిర్శనపల్లి సబ్‌స్టేషన్ వద్ద వెనుక నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కనగల్, జూన్ 10: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఉద్యమకారులు ఎంపీడీవోకు సోమవారం వినతిపత్రం అం దజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్ని కల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ప్రతి ఉద్యమకారుడికీ గుర్తింపుకార్డు, గౌరవ వేతనంగా నెలకు రూ.30వేలు, ప్రభుత్వ పథకాల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఉచిత బస్సు, రైల్వే పాసులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దాసరి వెంకన్న, అద్దంకి రవీందర్, ఎర్రమాద ప్రభాకర్‌రెడ్డి, ఐతగోని లక్ష్మయ్యగౌడ్, వడ్డెబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

● పులిచింతలకు నీటి చింత



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో పులిచింతల ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి 45.77 టీఎంసీలు. కాగా.. ప్రస్తుతానికి ఒక్క టీఎంసీ కూడా ప్రాజెక్టులో నిల్వ లేదు. ప్రస్తుతం 0.71 టీఎంసీలు మాత్రమే నీటి లభ్యత ఉంది. పులిచింతల ప్రాజెక్టుకు ప్రధానంగా కృష్ణానది వరద పై ఆధారపడగా ఎగువ ప్రాజెక్టులు నిండగా, కృష్ణానదికి గత సంవత్సరం కూడా నీటి లభ్యత లభించలేదు. నాగార్జునసాగర్ దిగువబాగాన ఉన్న తెలంగాణలోని మూసీ నదితో పాటు ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చే చిన్నపాటి వాగులు, వంకలతోనే ప్రాజెక్టు నీటి లభ్యత సమకూరుతుంది. ● మేళ్లచెర్వు

'ప్రజావాణి' అర్జీలు వెంటనే పరిష్కరించాలి

● ఉమ్మడి జిల్లాలో బాధితుల నుంచి దరఖాస్తుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న యాదాద్రిభువనగిరి కలెక్టర్ జెండగే

భువనగిరి అర్బన్, జూన్ 10: ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందినవి 30, మునిసిపల్ శాఖకు సంబంధించిన ఐదు, విద్యాశాఖ మూడు, పోలీసు, కార్మిక శాఖలకు చెందిన ఒక్కో దరఖాస్తు అందాయి. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేశారు. కార్య క్రమంలో డీఆర్డీవో ఎం.ఏ. క్రిష్ణన్, జడ్పీ సీఈవో శోభరాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

- తన భర్త రెండో భార్యతో కలిసి గ్రామస్థుల తీర్మానానికి వ్యతిరేకంగా ఎకరం భూమి తనకు కాకుండా అడ్డుకుంటున్నాడని ఆత్మకూర్(ఎం) మండలం సారగండ్లగూడేనికి చెందిన పంగ సుశీల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు పంచాయతీలో 20ఏళ్లు, ఎంపీటీసీకి 25ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్ అవకాశం రాలేదని, దీంతో ఆ సామాజిక వర్గం రాజకీయంగా పూర్తిగా వెనకబడిపోయిందని గ్రామానికి చెందిన జి. ప్రకాశ్, జి. మధు, గుర్రం నర్సింహులు గడ్డం జహంగీర్ ఫిర్యాదు చేశారు.
- వృద్ధురాలినైన తనను పట్టించుకోకుండా రైల్వే పించన్ పుస్తకం, 11 తులాల బంగారం, నగదు తీసుకున్న అల్లుడు, అతని కూతుళ్లపై చర్యలు తీసుకోవాలని ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన మల్లమ్మ ఫిర్యాదు చేశారు.
- తన పింఛన్‌ను పునరుద్ధరించాలని భూదాన్‌పోచంపల్లి మండలం పిల్లాయిపల్లికి చెందిన దివ్యాంగురాలు కలకొండ లక్ష్మీ ఫిర్యాదు చేశారు. తనకు ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన సదరం క్యాంపు ద్వారా 77శాతం వైకల్యం ఉందని నిర్ధారించగా 2013 సెప్టెంబరు నెల వరకు పింఛన్ అందేదని, ఆ తర్వాత నిలిచిపోయిందని, దానిని పునరుద్ధరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- తన కుటుంబానికి ప్రాణహాని ఉందని బొమ్మలరామారం మండలం చీకటిమామిడికి చెందిన బూడిద అన్నపూర్ణ ఫిర్యాదు చేశారు. గతంలో తమ కుటుంబసభ్యులపై దాడి జరిగిందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు.

చందుపట్ల ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి



సూర్యాపేట కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సూర్యాపేట(కలెక్టరేట్): సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని చందుపట్ల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రవిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహి ంచారు. గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్లని వారికి హాజరు వేసి అక్రమంగా డబ్బులు తీసుకున్నాడని ఆరోపించారు. గ్రామంలో 200మందికి పైగా పనులు కల్పించాలని దరఖాస్తు చేసుకున్నా పనులు కల్పించడంలేదని ఆరోపించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల అనంతుల ఎల్లయ్య, వినోద, వెంకటమ్మ, ఉపేందర్, సునీల్, వెంకన్న, రేణుక, సునీత, ఎల్లమ్మ ఉన్నారు.

బైపాస్ నిర్మాణానికి మూడో ప్రతిపాదన అశాస్త్రీయం

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి మూడో ప్రతిపాదన అశాస్త్రీయమైనదని, వెంటనే ఉపసంహరించుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. బైపాస్‌రోడ్డు బాధితుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం 'ప్రజావాణి'లో కలెక్టర్ దాసరి హరి చందనకు వినతిపత్రం అందజేశారు. మూడో ప్రతిపాదిత రోడ్డుతో పట్టణంలోని పలు కాలనీలకు చెందిన సుమారు 2,730 కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. 196 ఇళ్లు పూర్తిగా కోల్పోవాల్సి వస్తోందన్నారు. మొదటి ప్రతిపాదన ప్రకారం రోడ్డు నిర్మిస్తే భూసేకరణ వ్యయం తగ్గుతుందని, ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు మొదటి ప్రతిపాదిత రోడ్డుకే ఆమోదం తెలపాలని కోరారు. కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, పెరిక జానయ్య, భిక్షం, యాదగిరిరెడ్డి, నర్సిరెడ్డి, నాగమణి, కవిత, స్వప్న, రజిత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి

నల్లగొండ టౌన్, జూన్ 10: గ్రామీణ వైద్యులపై దాడులను ఆపాలని సుశ్రుత గ్రామీణ వైద్యులు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆర్ఎంపీలు సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న గ్రామీణ వైద్యులు జీవో 1273, 428, 429 ప్రకారం కమ్యూనిటీ పారా మెడిక్ కోర్సు ట్రైనింగ్ పూర్తిచేశారన్నారు. ఐఎంఏ డాక్టర్లు సైతం వెళ్లని మారుమూల గ్రామాల్లో సైతం వైద్య సేవలందిస్తున్నామన్నారు. అలాంటి గ్రామీణ వైద్యులపై ఎన్ఎంసీ, హెఆర్‌డీఏ టీజీఎంసీ కౌన్సిల్ నుంచి విజిలెన్స్ అధికారుల పేరుతో వచ్చి దాడులు నిర్వహించడం శోచనీయమన్నారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హన్మంతరావు, శ్రీనివాసరాజు, చారి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: ఆర్ఎంపీలకు చట్టబద్ధత కల్పించాలని మండల కేంద్రంలో ఆర్ఎంపీలు రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు వీపూరి పారంకుశం, దునక వెంకన్న, బండారు ధనుంజయ, మాదు వెంకన్న, అశోకాచారి, దామెర్ల శ్రీనివాస్, జబ్బార్, దొనకొండ అంజయ్య, స్వామి, వీరాచారి పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్ఎంపీలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తిరుమలగిరి రూరల్, నడిగూడెం, హుజూర్‌నగర్, నాగారం, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జలాల్‌పురం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం జి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని రాఘవపురంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఐదో రోజు బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థులకు నూతన అడ్మిషన్ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.వెంకటయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉమారాణి, షరీఫ్, హుస్సేన్, రవి, రమేష్, సీఆర్పీ సోమేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ అమృత పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తోందని ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు అన్నారు. మండలంలోని రామాపురం, ఈకేపేట గ్రామాల్లో నిర్వహించిన బడిబాట ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడారు. బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో దుర్గప్రసాద్, హెచ్ఎం గోపిరెడ్డి, సీఆర్పీ రామారావు, కార్యదర్శి కళావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అన్నెపురెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ఎస్‌టీయూ నాయకుడే హెచ్ఎం మాబాషా కోరారు. పట్టణంలోని గోవిందపురం, కనకదుర్గ వీధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు.కార్యక్రమంలో శ్రీనివాస్‌కుమార్, రామతారక, గొట్టె శ్రీనివాస్‌యాదవ్, ఆర్.శ్రీను, సీఆర్పీ సైదులు పాల్గొన్నారు.

నాగారం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇంగ్లిషు మీడియం పాటు నాణ్యమైన విద్య అందుతుందని మామిడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం ఎండీ మక్సూద్ అన్నారు. సోమవారం మండలంలోని మామిడిపల్లి, పస్తాల గ్రామాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు, తల్లుల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కలిసి ర్యాలీని నిర్వహించారు. బాలబాలికలను గుర్తించి పాఠశాలలో చేరేవిధంగా చర్యలు తీసుకున్నారు.



నడిగూడెం మండలం రామాపురంలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ జ్యోతి



నాగారం మండలం మామిడిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తిరుమలగిరి మండలం రాఘవపురం గ్రామంలో నూతన అడ్మిషన్ ఇస్తున్న ఉపాధ్యాయులు

మఠంపల్లిలో చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలి

మఠంపల్లి, జూన్ 10: మండల కేంద్రంలో ప్రభుత్వం చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యపాండునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మత్స్యకారుల సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మఠంపల్లిలో చేపల మార్కెట్ లేనందున మత్స్యకారులు . కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లాలంటే పడవలు, పుట్టిల మీద వెళ్లాల్సి వస్తోందన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు కృష్ణానదిలో చేపల వేట కోసం మరబోట్లు, అర్హులైన వారికి ఇళ్లు, పింఛన్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవా లని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి బాలునాయక్, రన్‌మియా, నరేష్, బాలు, వెంకటేష్, శ్రీను, సైదులు ఉన్నారు.

బీసీ హాస్టళ్ల భవనాలకు మరమ్మతు చేయాలి

మేళ్లచెర్వు, జూన్ 10: బీసీ హాస్టళ్ల భవనాలకు మరమ్మతు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ నాయుడు ప్రభు త్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీ హాస్టళ్ల మరమ్మతు కోసం ఒక్క పైసా విడుదల చేయలేదని, దీంతో రాష్ట్రంలోని బీసీ హాస్టళ్లన్నీ శిథిలావస్థకు చేరాయన్నారు. ఈ నెల 12వ తేదీన నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్నందున రాష్ట్ర ప్రభుత్వం బీసీ హాస్టళ్ల మరమ్మతుకు అవసరమైన రూ.400కోట్లను విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న 313బీసీ హాస్టళ్లకు తక్షణమే సొంత భవనాలను నిర్మించాలని, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

బీఆర్ఎస్ కుటుంబాలకు అండగా ప్రమాద బీమా

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 10: వివిధ కారణాలతో మరణించిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా ఎంతగానో అండగా నిలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ కారణాలతో మరణించిన నియోజకవర్గంలోని ముగ్గురు బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పు ప్రమాద బీమా చెక్కులను అందజేసి మాట్లాడారు. కార్యకర్తలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాలను ఆదుకోవడం కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకుపార్టీ అధిష్ఠానం నిత్యం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్‌కుమార్, ఎంపీపీ నెమ్మాది భిక్షం, నాయకులు ఆకుల లవకుశ, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, రఫీ, ఎల్క హరీష్‌రెడ్డి, నెమ్మాది నగేష్, కరుణశ్రీ పాల్గొన్నారు.

వేపలసింగారంలో గంగమ్మ జాతర



గంగమ్మజాతరలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 10: మండలంలోని వేపలసింగారంలో రెండు రోజుల పాటు గంగమ్మజాతరను వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా, కురవాలని రైతులు పాడిపంటలతో కళకళలాడాలని ప్రత్యేక పూజలు చేశారు. రైతులు ప్రభలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అన్నెం కొండారెడ్డి, చక్కెర వీరారెడ్డి, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, గురవయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, గోపిరెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హుజూర్‌నగర్, జూన్ 10: మండలంలోని వేపలసింగారంలోని ఆర్‌సీఎం పాఠశాలలో 1985-86పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టేక్లా, శ్రీనివాస్, పద్మ, శైలజ, మల్లారెడ్డి, నాగవాసిని, వసంతరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, జూన్ 10: మండలం మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చె న్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్యస్వామి..

మఠంపల్లి, జూన్ 10: మండలంలోని బక్కమంతులగూడెం గ్రామంలోని త్రివేణి నగర్‌లో శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్యస్వామి కల్యాణాన్ని మంగళవారం నిర్వహించడానికి ఆలయాన్ని ముస్తాబు చేశారు ఆలయాన్ని రకరకాల విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కల్యాణోత్సవాన్ని ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ దేవాలయ అర్చకుడి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ చిలువేరు నాగేశ్వరావుతెలిపారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తిరుపతమ్మ కల్యాణానికి రూ.50వేలు విరాళం

హుజూర్‌నగర్: మఠంపల్లి మండలం బక్కవంతులగూడెంలో తిరుపతమ్మగోపయ్యస్వామి కల్యాణం సందర్భంగా అన్నమయ్య భజన మండలి సభ్యులు సోమవారం రూ.50వేల విలువైన 20కిలోల కందిపప్పు, మూడు క్వింటాళ్ల బియ్యం, రూ.18వేలు, నిత్యావసర సరుకులు అందచేశారు. కార్యక్రమంలో బాచిమంచి కొండయ్య, ఆకుల రాము, రజని, నాగేశ్వరరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు బహిరంగ వేలం

మఠంపల్లి, జూన్ 10: మండలంలోని చౌటపల్లి గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ భూములను సోమవారం బహిరంగా వేలం పాట నిర్వహించారు. చౌటపల్లి రెవెన్యూ పరిధిలో మొత్తం 15.30ఎకరాల భూములకు 2024-25 సంవత్సరానికి నిర్వహించిన ఈ వేలం పాటలో రూ.2.71లక్షలకు దక్కించుకున్నట్లు దేవాలయ ఇన్‌చార్జి ఈవో టి.వెంకటచలపతి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటనారాయణ, సింగారపు సైదులు, మద్ది హుస్సేన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లచ్చిరెడ్డి, నర్సయ్య, కోటయ్య, ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

'రైతు భరోసా' నిధులు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరిరావు

తుంగతుర్తి, జూన్ 10: రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభమైనందున పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. సోమవారం తుంగతుర్తిలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున రైతులకు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయ డానికి ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా సంక్షేమ పథకాన్ని వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు సొసైటీల ద్వారా సబ్సిడీపై విత్తనాలను అందించాలన్నారు. అర్హత ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసినందున సంక్షేమ పథకాలను కొనసాగించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కడియం కుమార్, కల్లెపల్లి భాస్కర్, దేవరాజు ముత్తయ్య, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సైదులు, వెంకయ్య, శైలజ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై విచారణ చేపట్టాలి

నేరేడుచర్ల, చిలుకూరు,జూన్ 10: వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాల్లో అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుచర్లలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో 67మంది విద్యార్థులు 720/720 మార్కులు పొందారన్నారు. హర్యానాలోని ఓ పరీక్ష కేంద్రంలోని ఒకే గదిలో పరీక్ష రాసిన ఎనిమిది మందికి 720 మార్కులు వచ్చాయన్నారు. దీని ప్రకారం ప్రశ్నపత్రం లీకవడం లేదా మాస్ కాపీయింగ్ జరిగి ఉంటుందనే అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. దీనిపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్రరాజు వెంకట్, సొల్లేటి శివ, నందిపాటి పండు, చిలకరాజు జయంతి, వనపర్తి యశ్వంత్, రాహుల్, నర్సింహ, వినయ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

●నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపించాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కడారు మధు కోరారు. చిలుకూరు మండల కేంద్రంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్ దిష్టిబొమ్మను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దహనం చేసి అనంతరం మాట్లాడారు. నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య కళాశాలల్లో సీట్లు కేటాయించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదవరపు లక్ష్మయ్య, షేక్ జానీ మియా, గడ్డం ప్రశాంత్, సాయికుమార్, యల్లేష్, రాంబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

'ఎమ్మెల్యే అసత్య ప్రచారాలు మానుకోవాలి'

తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల, జూన్ 10: ఎమ్మెల్యే మందుల సామేలుపై అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ తిరుమలగిరి మండల అధ్యక్షుడు వై.నరేష్, నూతనకల్ మండల కాంగ్రెస్ నాయకుడు దరిపెల్లి వీరన్న, మిర్యాల దేవాలయ కమిటీ చైర్మన్ గోరుగంటి రామచందర్‌రావు, ఎస్సీ సెల్ నాయకుడు ఇరుగు కిరణ్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ మద్దిరాల మండల అధ్యక్షుడు సుల్తాన్ నరేష్ సోమవారం తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల మండలాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు, నిబంధన ప్రకారం ఇసుక తవ్వకాలు జరుగుతుంటే, ఎమ్మెల్యే సామేలుకు సంబంధం ఉందని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే సామేల్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక, సోషల్ మీడియా ద్వారా కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, వేల్పుల రఘు, మధు,ఉదయ్, వెంకన్న, మల్లయ్య, సత్తయ్య, సుబ్బు, జగదీష్, మనోజు, అనిల్, వెంకన్నఉన్నారు.

బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

కోదాడ టౌన్, జూన్ 10: సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు పట్టణంలో సోమవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు మాట్లాడుతూ సినీ రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ ఆయన అడుగు జాడలో యువత నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొండపు సతీష్, ఉన్నం హనుమంతరావు, చేపల శ్రీను, ఉప్పగండ్ల శ్రీనివాసరావు, సజ్జారామ్మోహన్, చావ హరినాద్, ఏటుకూరి సురేష్, నెల్లూరి వెంకటేశ్వర్లు, కోదాడ రేవంత్‌రెడ్డి, ముద్రా రామారావు, బాబు ఉద్దీన్, గద్దె వెంకటేశ్వరరావు, పూర్ణ, హరిబాబు, సహదేవ్, హనుమంతరావు, రాంబాబు, రమేష్, కార్తీక్, పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యల్క సోమయ్య

మునగాల రూరల్, జూన్ 10: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2009నుంచి కార్డులు పొందిన కార్మికులకు ఆధార్ అప్డేట్ కాలేదన్నారు. అప్డేట్ కోసం హైదరాబాద్ వెళ్లాలని లేబర్ అధికారులు తెలియజేయడంతో కొంతమంది బోర్డు కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారన్నారు. మరికొందరు హైదరాబాద్ వెళ్లలేక సంక్షేమ పథకాలకు అనర్హులవుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు, మండల కన్వీనర్ బచ్చలకూర స్వరాజ్యం, మండల అధ్యక్షుడు షేక్ దస్తగిరి, ప్రధాన కార్యదర్శి మామిడి నాగేంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు అల్లి నాగరాజు, పాషా, కనకయ్య సుబ్బారావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అందించాలి

కోదాడ రూరల్, జూన్ 10: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు రైతు భరోసా, పండించిన పంటలకు బోనస్, పంట బీమా వంటి పథకాలు అమలు చేసేందుకు విధి విధానాలు రూపొందించాలని రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ కోరారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని తమ్మర గ్రామంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన రైతులు, కౌలు రైతుల అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి వాస్తవంగా సాగు చేసే కౌలు రైతులను గుర్తించి 2011 చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు.సమావేశంలో రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పోను సూర్యనారాయణ, కౌన్సిలర్లు సామినేని నరేష్, బత్తినేని హనుమంతరావు, కనగాల రాధాకృష్ణ, బొల్లు ప్రసాద్, తూమాటి రామయ్య, మాతంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న పశ్య పద్మ

చెరువు మట్టి అక్రమంగా తరలింపు



తిరుమలగిరి పెద్దచెరువులో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని పెద్దచెరువులో మట్టిని లూటీ చేస్తున్నారు. రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్ల ద్వారా మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా వెంచర్లు, ఇసుక బట్టీలకు, ఇతర అవసరాలకు తరలిస్తున్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగానే మట్టిని తరలిస్తున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. . సోమవారం పెద్దచెరువులో రెండు ఎక్స్‌కవేటర్లతో మట్టిని పదుల సంఖ్యల ట్రాక్టర్‌ల ద్వారా మట్టిని తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ సుధను వివరణ కోరగా మట్టి తవ్వకాలకు ఎవరికీ తను మతి ఇవ్వలేదన్నారు. మట్టిని అక్రమంగా తరలించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

● తిరుమలగిరి



సూర్యాపేట సిటీ, ఆత్మకూర్(ఎస్): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు పుట్టినరోజు వేడుకలను సూర్యాపేటలో, ఆత్మకూర్ (ఎస్)మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్‌రావు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జనగాం క్రాస్‌రోడ్డులో స్నేహ నిలయంలోని పేదలకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. ఆత్మకూర్(ఎస్)లో మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని పందిరి రాంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీ అబీద్, వీరేందర్, మల్సూర్ గౌడ్, సుశింధర్‌రెడ్డి, కరుణాకర్ గౌడ్, సంతోష్, సంపత్‌నాయుడు, సాయి, శ్రీను, ఏకస్వామి పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకుడు బురెడ్డి సంజీవరెడ్డి ఆశయాలను సాధించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. సోమవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో నిర్వహించిన సంస్మరణ సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో కొండేటి సంజీవరెడ్డి, పుల్లారు సింహాద్రి, పిడమర్తి భరత్, వీరారెడ్డి, సోమారపు పిచ్చయ్య, సైదులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసేందుకుపట్టణంలోని మట్టపల్లి బైపాసు రోడ్డులో విద్యుత్ సరఫరాను మంగళవారం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేస్తున్నట్లు ఏఈ రామప్రసాద్‌గౌడ్ తెలిపారు.

హుజూర్‌నగర్ రూరల్: వనస్థలిపురం అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పల్లె కాశిరెడ్డి స్వగ్రామమైన మండలంలోని వేపలసింగారం గ్రామానికి సోమవారం వచ్చారు. ఆయనను పదో తరగతి పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు, నాయకులు ఘనంగా సన్మానించారు.

పాలకవీడు: మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు వస్తుందా? రావడం లేదా? అని పాలకవీడు మండలంలోని రావిపహాడ్‌లో పంచాయతీ కార్యదర్శి సైదులు సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు.

మునగాల రూరల్: మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో టీడీపీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జెట్టి వెంకట్‌రెడ్డి 23వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మండలంలోని జెట్టి వెంకట్‌రెడ్డి సేవలు మరువలేనివని అన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, రామిరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

మునగాల రూరల్: మండలంలోని ముకుందాపురం గ్రామంలో ఉన్న ఇందిర వృద్ధాశ్రమంలో సోమవారం మండల కేంద్రానికి చెందిన సుంకరి నాగయ్య వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయమ్మ పాల్గొన్నారు.

కోదాడ టౌన్: రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య అన్నారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులపై సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.కనకారావు, సత్యనారాయణరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ పరిధిలోని తమ్మరలో డాక్టర్ సురేష్ జకోటియా ఆసుపత్రిలో పిల్లలకు ఉచిత స్వర్ణప్రాసన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ జకోటియా మాట్లాడుతూ ఈ మందుతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి, మానసిక వికాసం, సమగ్రాభివృద్ధి పెరుగుతుందన్నారు కార్యక్రమంలో డాక్టర్లు వంగవీటి భరత్‌చంద్ర, గడ్డం లక్ష్మీప్రసన్న, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అనంతచక్రవర్తి, నిఖిల్, వెంకటనారాయణ, జిల్లా లక్ష్మీనర్సయ్య, జగిని ప్రసాద్, వంగవీటి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం: నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అజయ్‌కుమార్ అన్నారు. స్టేషన్ పరిధిలోని త్రిపురవరంలో సోమవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలపై షీటీం, పోలీస్ శాఖ, కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాజాత బృందం పాల్గొంది.

నూతన్‌కల్, మద్దిరాల: ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైందని తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

● మద్దిరాల మండలంలో ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను తహసీల్దార్ అమీన్‌సింగ్ స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తిరుమలగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఆసుపత్రుల్లో పండ్లు, పాలు, బ్రెడ్ అందచేశారు. కార్యక్రమంలో తన్నీరు రాంప్రభు, శ్యాం, బ్రహ్మం పాల్గొన్నారు.

తిరుమలగిరి: భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని తిరుమలగిరి మండల కాంగ్రెస్ నాయకుడు స్టేట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డితో సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఽసంకెపల్లి కొండల్‌రెడ్డి, ఖలీం తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న12 వాహనాలకు ఈనెల 13న తుంగతుర్తి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 13వ తేదీ ఉదయం 10 గంటలకు కార్యాలయానికి చేరుకుని ధరావత్తు సొమ్ము చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

నాగారం: నాగారం పాల ఉత్పత్తిదారులు మదర్‌డైరీ ఎన్నికలు సోమవారం జరిగాయి. మదర్ డైరీ చైర్మన్‌గా సంజీవ్, డైరెక్టర్లుగా బుచ్చిబాబు, రాంరెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, నవనీత, పిచ్చమ్మను ఎన్నుకున్నారు.